సాక్షి
అనంతపురం
శనివారం : 19 ఏప్రిల్ 2025



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



ఇంగ్లిష్ సార్లు లేరిక్కడ!

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ టీచర్లు లేకపోవడంతో బోధన కుంటుపడుతోంది. 10లో

గరిష్టం/కనిష్టం
40.9°/24.2°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



నివాళులర్పిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: తీవ్రమైన ఎండలతో ఓ వృద్ధురాలు వడదెబ్బకు గురై మృతి చెందింది. ఓబులాపురం గ్రామానికి చెందిన మహానందరెడ్డి శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తోటకు వెళ్లారు. కాసేపటి తర్వాత ఆయన తల్లి రామక్క (80) కూడా నడుచుకుంటూ తోటకు వెళ్లింది. కాసేపు తోటంతా కలియదిరిగి 11.30 గంటల తర్వాత తిరిగి ఆమె నడుచుకుంటూ ఇంటికి చేరుకుంది. భగభగ మండే ఎండలోనే తిరగడంతో ఆమె వడదెబ్బకు గురైంది. కాస్త అలుపు వచ్చినట్టవడంతో ఇంటి బయటే మంచంపై పడుకుంది. గంట తర్వాత కుమారుడు, కోడలు వచ్చారు. నీళ్లు తాగాలని చెబుతూ లేపడానికి ప్రయత్నించగా ఆమెలో చలనం లేదు. నిశితంగా పరిశీలించగా అప్పటికే ఆమె ఊపిరి ఆగిపోయింది. వడదెబ్బతోనే ప్రాణం విడిచిందని నిర్ధారించుకున్నారు. ఈమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎస్‌ఆర్‌ఐ వింగ్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఓబులాపురం వెళ్లి రామక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ టి.శైలజ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు www.samagrashikshaatp.blogspot.com వెబ్‌సైట్ ద్వారా శనివారం నుంచి ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 42 ఏళ్ల వరకు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగినులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందని తెలిపారు. రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు, గౌరవ వేతనం, విద్యార్హత వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచిన నోటిఫికేషన్ ద్వారా పొందాలని ఏపీసీ వివరించారు.

ఖాళీల వివరాలు ఇలా...

- టైప్–3లో మొత్తం 43 ఖాళీలు (హెడ్‌కుక్–8, అసిస్టెంట్ కుక్–19, డేఅండ్‌నైట్ వాచ్ ఉమెన్–5, స్వీపర్–6).
- టైప్–4లో మొత్తం 28 ఖాళీలు (హెడ్‌కుక్–6, అసిస్టెంట్ కుక్–14, చౌకీదార్–8)

'కూలీల హాజరు పెంచండి'

ఆత్మకూరు: ఉపాధి కూలీల హాజరు శాతాన్ని పెంచాలని సంబంధిత అధికారులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ మల్లెల శివప్రసాద్ ఆదేశించారు. గొరిదిండ్ల పంచాయతీలో చేపట్టిన ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. ప్రతి పంచాయతీలో కూలీల సంఖ్య పెంచి పనుల లక్ష్యం త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతులు తమ పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకుంటే భూములు సారవంతమవుతాయన్నారు. డ్రైల్యాండ్ హార్టీకల్చర్‌లో భాగంగా మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ చెన్నకేశవులు, ఈసీ బబ్లు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లో మునక



క్రేజీ గేమ్ క్రికెట్. పొట్టి ఫార్మాట్, వన్డే, టెస్టు ఏదైనా సరే ఆట చూసేందుకు అభిమానులు అమితాసక్తి కనబరుస్తారు. ఆటను ఆటగా ఆస్వాదించినంత వరకు బాగానే ఉంటుంది. అయితే కొంతమంది కుర్రాళ్లు ఆ ఆటపై పందెం కాసి సునాయాసంగా డబ్బు సంపాదించాలనుకుంటున్నారు. పాకెట్ మనీతో మొదలైన బెట్టింగ్ అత్యాశతో అప్పులు చేసే స్థాయికి తీసుకెళ్తుంది. ఆ తర్వాత అప్పుల చట్రబంధం నుంచి తప్పించుకోవడానికి నేరస్తులుగా మారుతున్నారు.

- రోజూ రూ.150 కోట్ల వ్యాపారం
- తాడిపత్రి కేంద్రంగా భారీగా బెట్టింగ్
- ఆర్థికంగా చితికి... చైన్‌స్నాచర్లుగా మారుతున్న యువత
- ఇంటర్మీడియెట్ విద్యార్థులూ బెట్టింగ్ మీద ఆసక్తి
- ఐపీఎల్ మ్యాచ్‌లతో ఆర్థికంగా పతనావస్థకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : క్రికెట్.. ప్రేక్షకులను రంజింపచేయడమేమో కానీ బెట్టింగ్ రూపంలో పలువురి జీవితాలను కబళిస్తోంది. కుటుంబాలకు కుటుంబాలే దుఃఖసాగరంలో మునిగిపోతున్న దుస్థితి. ఎక్కడో జరుగుతున్న ఆటపై ఇక్కడ పందెం కాస్తూ క్రికెట్‌ను అతిపెద్ద జూద స్థావరంగా మార్చుకున్న యువతకు ఇదొక శాపంగా పరిణమించింది. పండ్ల తోటలు, మెట్ట పైర్లకు వేదికగా, కరువు ప్రాంతంగా ముద్రపడిన ఉమ్మడి అనంతపురం జిల్లా ఇప్పుడు అతిపెద్ద బెట్టింగ్ కేంద్రంగా మారి వందలాది కుటుంబాలను చిదిమేస్తోంది. ఐపీఎల్ మ్యాచ్‌లు ఒక్కరోజులోనే ఎంతోమంది యువకుల జీవితాలను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి.

ఒక్కో మ్యాచ్‌కు రూ.150 కోట్ల బెట్టింగ్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్కో ఐపీఎల్ మ్యాచ్‌కు రూ.150 కోట్లకుపైగా బెట్టింగ్ జరుగుతున్నట్టు అంచనా. బెట్టింగ్‌లో ఎక్కువగా 30 ఏళ్లలోపు యువత పాల్గొంటున్నట్టు పోలీసులు చెబుతున్నారు. మ్యాచ్ మొత్తానికి ఒక పందెం, ఓవర్ టు ఓవర్ ఇలా రకరకాలుగా పందెం కాస్తున్నారు. నాలుగు రోజుల కిందట పంజాబ్ కింగ్స్ లెవెన్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ జరిగింది. ఇందులో పంజాబ్ కింగ్స్ లెవెన్ 111 పరుగులు మాత్రమే చేసింది. కోల్‌కతా గెలుస్తుందని వెయ్యికి లక్ష రూపాయలు పందెం జరిగింది. పంజాబ్ ఓడిపోతుందని బెట్టింగ్ కాసిన వాళ్లు బికారులైపోయారు.

ఆర్థికంగా చితికి దొంగలుగా మారి..

నాలుగు రోజుల క్రితం ఆరుగురు చైన్‌స్నాచర్లను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు. వీరి పూర్వాపరాలు ఆరా తీస్తే.. అందరూ క్రికెట్ బెట్టింగ్ ఆడి ఆర్థికంగా అప్పులపాలైన వారే. అప్పుల నుంచి గట్టెక్కేందుకు చైన్‌స్నాచర్లుగా మారారు. ఎక్కడ ఒంటరి మహిళలు కనిపించినా బంగారు గొలుసులు లాక్కెళ్లడం, వచ్చిన డబ్బుతో జల్సా చేయడం.. ఇదీ పరిస్థితి. వీళ్లే కాదు ధర్మవరం, కదిరి, హిందూపురం, అనంతపురం, ఉరవకొండ ఇలా పలు ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగుల్లో నష్టపోయిన వారు దొంగలుగా మారారు. కొంతమంది అప్పుల వారి నుంచి ఒత్తిడి భరించలేక బలవన్మరణానికి పాల్పడి తల్లిదండ్రులకు గర్భశోకం మిగుల్చుతున్నారు.

తాడిపత్రి కేంద్రంగా బుకీలు

గంజాయి, మట్కాకే కాదు ఇప్పుడు బుకీలకూ తాడిపత్రి కేంద్ర బిందువైంది. గొలుసు దొంగలు (చైన్‌స్నాచర్లు) దొరికిన రెండు రోజులకే తాడిపత్రిలో క్రికెట్ బుకీలు పోలీసులకు చిక్కారు. దొరికింది ఏడుగురే అయినా ఇంకా చాలామంది ఉన్నట్టు పోలీసుల అంచనా. అమాయక యువకులకు ఆశ చూపి బెట్టింగ్ ఉచ్చులోకి దింపుతున్నారు. సర్వస్వం కోల్పోయాక కానీ కుర్రాళ్లు తెలుసుకోలేరు. ఇంటర్మీడియెట్ కుర్రాళ్లు సైతం బెట్టింగ్ ఉచ్చులో ఇరుక్కుని విలవిలలాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ ఒక విషవలయంలా మారింది.

జీవితాలు ఫణంగా పెట్టొద్దు



పంపాచారి, షాకీర్, నాగార్జున, ఫజిల్ అహ్మద్ ఈ నలుగురూ పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లలో నష్టపోయి దొంగలుగా మారారు. ఈజీ మనీకోసం ఇలా బెట్టింగ్.. ఆ తర్వాత దొంగతనాలు చేయడం జరుగుతోంది. యువత కెరీర్ చూడాలి కానీ బెట్టింగ్ వైపు కాదు. క్రికెట్ బెట్టింగ్ ప్రమాదకరం. ఆటను ఆటవరకే ఆస్వాదించాలి కానీ బెట్టింగ్‌వైపు చూడకూడదు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆర్థిక స్థితిగతులపై ఒక నిఘా వేసి ఉంచాలి. పేకాట, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌వైపు వెళ్లి జీవితాలు ఫణంగా పెట్టకండి.

–పి.జగదీష్, ఎస్పీ, అనంతపురం

ఉమ్మడి జిల్లాలో బెట్టింగ్ వివరాలు

బెట్టింగ్ బుకీ ముఠాల సంఖ్య	30-40
ఒక్కో ఐపీఎల్ మ్యాచ్‌కు బెట్టింగ్	రూ.150 కోట్ల పైనే
బెట్టింగ్ ఆడుతున్న వారి సంఖ్య	30,000 అంచనా
బెట్టింగ్ ఆడుతున్న వారి వయస్సు	35 ఏళ్ల లోపు
ఆత్మహత్య చేసుకుంటున్న బాధితులు నెలకు	10కి పైనే

పోలీసులు న్యాయం చేసే వరకూ పోరాడతా

- రైలు నుంచి దూకిన ఘటనలో బాధిత యువతి ఆవేదన

ఉరవకొండ: రైలులో తనపై అసభ్యకరంగా ప్రవర్తించి దాడి చేయడానికి ప్రయత్నించిన యువకుడిని అరెస్ట్ చేసి శిక్షించే వరకూ న్యాయపోరాటం సాగిస్తానంటూ బాధిత యువతి పేర్కొన్నారు. వివరాలు... ఉరవకొండకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 22న తన మొబైల్ మరమ్మతు చేయించుకునేందుకు సికింద్రాబాద్‌కు వచ్చిన ఆమె తిరిగి తాను నివాసముంటున్న మేడ్చల్‌కు ఎంఎంటీఎస్ రైలులో బయలుదేరింది. తాను ఎక్కిన బోగీలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో అందులో ఉన్న యువకుడు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో భయపడిన ఆమె తనను తాను రక్షించుకునేందుకు కదిలే రైలు నుంచి ఒక్కసారిగా కిందకు దూకారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఉరవకొండలోని ఇంటికి చేరుకున్నారు. కాగా, ఘటనపై మార్చి 25న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రెండు రోజుల క్రితం యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అయితే తాను ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించలేదని, ఆమెనే రీల్స్ తీస్తూ ప్రమాదవశాత్తు జారి పడిందని విలేకరుల సమావేశంలో తెలిపాడు. దీంతో కంగుతిన్న యువతి... శుక్రవారం ఉరవకొండలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జరిగిన ఘటనను వివరించారు. యువకుడిని కాపాడాలన్న ఉద్దేశంతోనే పోలీసులు వాస్తవాన్ని వక్రీకరిస్తున్నారని, దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.

బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక రేపు

గుంతకల్లు: మే 2 నుంచి 4 వరకు కాకినాడలో జరిగే 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల జట్ల ఎంపికను ఆదివారం ఉదయం గుంతకల్లులోని రైల్వే క్రీడా మైదానంలో చేపట్టనున్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 94410 53041, 99662 24669లో సంప్రదించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి రాఘవేంద్ర కోరారు.

తప్పులకు ఎంఈఓలు, హెచ్‌ఎంలదే బాధ్యత

- నిబంధనల మేరకే పునర్వ్యవస్థీకరణ
- ఉమ్మడి జిల్లా డీఈఓల ఆదేశం



పాఠశాలల పునర్వ్యవస్థీకరణ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం జయచంద్ర

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో 117 జీఓకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పకడ్బందీగా, పారదర్శకంగా జరగాలని, ఏ చిన్న తప్పు జరిగినా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులదే పూర్తి బాధ్యత అని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖ అధికారులు ఎం.ప్రసాద్‌బాబు, క్రిష్టప్ప హెచ్చరించారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న నేపథ్యంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ వేగవంతం చేశారు. తుదిదశకు చేరుకోవడంతో ఎలాంటి తప్పులూ ఉండకూడదనే ఉద్దేశంతో శుక్రవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు హాజరయ్యారు. 15 రోజుల నుంచి సాగుతున్న ఎక్సర్‌సైజ్‌లో భాగంగా చిన్నచిన్న పొరపాట్లు జరిగాయని, డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాల్సిన సమయం దగ్గర పడడంతో స్కూళ్ల వారీగా ఎన్ని పోస్టులున్నాయి... ఎన్ని ఖాళీలున్నాయనేది పక్కాగా తేల్చాల్సి ఉందని డీఈఓలు స్పష్టం చేశారు. హెచ్‌ఎంలు, ఎంఈఓలు ప్రతిపాదించిన స్కూళ్ల వివరాలు, నిబంధనల ప్రకారం జరిగాయా లేదా? అని పరిశీలించారు. గుర్తించిన తప్పిదాలను సవరించారు.

అన్నమూ లేదు.. తాగునీళ్లూ లేవు

విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ సమావేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరైన ఎంఈఓలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లకు కనీసం భోజన వసతి కల్పించలేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమావేశంలో పాల్గొన్నారు. అసలే ఎండవేడిమి దంచేస్తోంది. మధ్యాహ్నం వరకు కనీసం తాగేనీళ్లు కూడా అందుబాటులో ఉంచలేదు. సమావేశానికి హాజరైన వారు తరచూ నీళ్ల కోసమని బయటకు వెళ్లడం కనిపించింది. మధ్యాహ్నం పైన చల్లని తాగునీరు ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులు ఉన్నా...మధ్యాహ్నం భోజనం విషయం గురించి పట్టించుకోలేదు.

ఆర్టీసీ ఆదాయానికి 'ప్రైవేటు' గండి

- డిపో ఎదుటే ప్రైవేట్ వాహనాల హల్‌చల్
- ఆర్టీసీ ప్రయాణికులను ఎక్కించుకుంటున్న వైనం
- టీడీపీ నాయకుల అండతో నిబంధనల ఉల్లంఘన



ఆర్టీసీ డిపో ముందే నిలిపిన ప్రైవేట్ వాహనాలు

ఉరవకొండ: ప్రైవేట్ వాహనాల దెబ్బతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. అధికార పార్టీ అండదండలతో ప్రైవేట్ ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా ప్రయాణికులను చేరవేస్తున్నారు. ఉరవకొండ ఆర్టీసీ డిపోలో సూపర్ లగ్జరీ–4, అల్ట్రా డీలక్స్–4, ఎక్స్‌ప్రెస్–7 ఆర్డినరీ –44 చొప్పున మొత్తం 59 బస్ సర్వీసులు ఉన్నాయి. రోజూ 21వేల కిలోమీటర్లు తిరుగుతూ 20 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ప్రతి నెలా ఆర్టీసీకి రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుండేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

అధికార టీడీపీ నాయకులతో ప్రైవేట్ ఆపరేటర్లు ఒప్పందం కుదుర్చుకుని ఏడు సీట్ల సామర్థ్యం కలిగిన 10 ఎర్టిగా కార్లను కొనుగోలు చేశారు. వీటిని ఉరవకొండ – అనంతపురానికి 8 సింగిల్స్ తిప్పుకోవాలని నిర్ణయించారు. సాధారణంగా ఉరవకొండ నుంచి అనంతపురానికి ఆర్టీసీ బస్సులో టిక్కెట్ ధర రూ.85 ఉంది. ఎర్టిగా వాహనంలో ఒక్కొక్కరికి వంద రూపాయల చార్జీ వసూలు చేస్తున్నారు. చిన్న, పెద్ద అందరికీ ఇదే ధర వర్తిస్తుంది. నిబంధనల ప్రకారం ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులను తరలించాలంటే ఎల్లో బోర్డు ఉండాలి. అయితే వైట్ బోర్డు కలిగిన వాహనంలోనే యథేచ్ఛగా తరలించేస్తున్నారు. అంతేకాదు పెట్రోలుతో నడిచే ఈ వాహనాలను ఆపరేటర్లు ఆదాయం కోసం గ్యాస్ సిలిండర్లను అమర్చుకుని తిప్పుతున్నారు. నాన్‌స్టాప్ కావడం, సమయం కలిసి రావడంతో ధర ఎక్కువైనా కొందరు ప్రయాణికులు వీటిలో ప్రయాణిస్తున్నారు. ఈ ప్రైవేట్ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా తిప్పడం వల్ల ఆర్టీసీ ఆదాయానికి నెలకు రూ.2.50 లక్షల దాకా కోత పడుతోంది. ఎక్కడైనా అధికారులు పట్టుకుంటే తమ పేరు చెప్పాలని టీడీపీ నాయకులు చెప్పడంతో ప్రైవేట్ ఆపరేటర్లు రెచ్చిపోతున్నారు. ఆదాయం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్ వాహనాలను కట్టడి చేస్తాం

ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ప్రైవేట్ వాహనాలను కట్టడి చేస్తాం. ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టాలని చూస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఉరవకొండ డిపో నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకొచ్చేలా కృషి చేస్తాం.

– హంపన్న, డిపో మేనేజర్, ఉరవకొండ

ఆ వాహనాలను సీజ్ చేస్తాం

ఉరవకొండ ఆర్టీసీ డిపో వద్దనే ప్రైవేట్ వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న విషయం మా దృష్టికి వచ్చింది. వైట్ బోర్డులు పెట్టుకుని ఇష్టారాజ్యంగా ఏడు నుంచి ఎనిమిది మందిని ఒకే వాహనంలో తీసుకెళ్తూ ఆర్టీసీకి నష్టం కలిగిస్తున్నారు. త్వరలోనే దాడులు నిర్వహించి ఆ వాహనాలను సీజ్ చేస్తాం.

– రాజాబాబు, ఆర్టీఓ, గుంతకల్లు

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- తన్నుకున్న తమ్ముళ్లు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సమక్షంలోనే రభస
- నాయకుల నుంచి వెల్లువెత్తిన ఫిర్యాదులు



ఘర్షణకు దిగిన టీడీపీ నాయకులు

అనంతపురం: టీడీపీ నేతల్లో విభేదాలు భగ్గుమన్నాయి. ప్రజాప్రతినిధులు తమను గుర్తించడం లేదని, పోస్టులు, పనుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని రభస చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ సమక్షంలోనే లుకలుకలు బయటపడ్డాయి. శుక్రవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రీవెన్స్ చేపట్టారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై పలువురు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మండల ఇన్‌చార్జ్‌గా ఉంటూ ఇబ్బందులు పడుతూనే పార్టీ కోసం కష్టపడ్డామని, ఇప్పుడు తమను ఏమాత్రమూ గుర్తించకుండా ఎమ్మెల్యే అన్యాయం చేస్తున్నారని యల్లనూరు మండలానికి చెందిన వాసాపురం బాబు అలియాస్ మనోహర్ నాయుడు ఫిర్యాదు చేశారు. స్టోర్ డీలర్‌షిప్పులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాల్లో తమ వర్గానికి కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఎమ్మెల్యే వర్గానికి చెందిన బొప్పేపల్లి రవికుమార్ రెడ్డి కల్పించుకోవడంతో వాగ్వాదం మొదలైంది. వాసాపురం బాబు, రవికుమార్‌రెడ్డి పరస్పరం దాడి చేసుకునే స్థాయికి వెళ్లారు. ఇన్‌చార్జ్ మంత్రి కల్పించుకుని ఇద్దరినీ అతిథిగృహం నుంచి బయటకు పంపించారు. బయటకు వచ్చిన వాసాపురం బాబుపై బొప్పేపల్లి రవికుమార్‌రెడ్డి తన అనుచరులతో కలసి దాడికి యత్నించాడు. దీంతో రవికుమార్‌రెడ్డి చొక్కాను వాసాపురం బాబు అనుచరులు గట్టిగా పట్టుకోగా.. అది చిరిగిపోయింది. సమీపంలోనే ఎస్పీ కార్యాలయం ఉన్నప్పటికీ అక్కడే రాళ్లు రువ్వుకునే స్థాయికి వెళ్లారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవను సద్దుమణిగించారు. అనంతరం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, రవికుమార్‌రెడ్డి కలసి వెళ్లి ఎస్పీ కార్యాలయంలో వాసాపురం బాబుపై ఫిర్యాదు చేశారు.

లీలావతి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తోంది

శింగనమల: ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని డమ్మీ చేసి తల్లి బండారు లీలావతి పెత్తనం చెలాయిస్తున్నారని టీడీపీకి చెందిన వెస్ట్ నరసాపురం ఎంపీటీసీ సభ్యురాలు అంజినమ్మ, ప్రసాద్‌నాయక్ దంపతులు ఆరోపించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం దక్కడం లేదని వారు శుక్రవారం అనంతపురం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌కు ఎమ్మెల్యే సమక్షంలోనే ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి పది నెలలైనా ప్రజా సమస్యల గురించి ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ప్రజా సమస్యలు తీర్చకుండా పదవిలో ఉండి అవమానం పొందడం కన్నా ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి, వ్యక్తిగత గౌరవం కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

టూమెన్ కమిటీకి ప్రాధాన్యత ఏదీ?

శింగనమల నియోజకవర్గంలో ఫీల్డ్ అసిసెంట్ పోస్టులను ఎమ్మెల్యే వర్గానికి చెందినవారితోనే భర్తీ చేశారని, టూమెన్ కమిటీ సిఫార్సు చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఓ టీడీపీ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. తన గోడును ఇన్‌చార్జ్ మంత్రికి తెలియజేసేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో సదరు కార్యకర్త తీవ్రస్థాయిలో వాగ్వాదం చేశాడు. పోలీసులు జోక్యం చేసుకుని అతనికి మంత్రిని కలిసే అవకాశం కల్పించారు.



ఇన్‌చార్జ్ మంత్రితో గోడు వెల్లబోసుకుంటున్న ఎంపీటీసీ అంజినమ్మ భర్త ప్రసాద్ నాయక్

కూటమిలో సమస్యలు చిన్నవే

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి పార్టీల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, వాటిని సర్దుకుంటూ ముందుకెళ్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురం వచ్చిన ఆయన ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. నామినేటెడ్ పదవుల భర్తీ, తదితర విషయాల్లో కూటమి నేతల మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. ఇలాంటి వాటిని పరిష్కరించేందు కోసమే ప్రతి జిల్లాకూ ఇన్‌చార్జ్ మంత్రులను నియమించారన్నారు. టీటీడీ గోశాలపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలూ లేవని, గోవుల మృతికి కారణాలు అనుకోకుండా జరిగేవేనని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుమ్మనూరు జయరామ్, బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం



అనంతపురం రామచంద్రనగర్ చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



తాడిపత్రిలో క్రీస్తు శిలువ వృత్తాంతం ప్రదర్శన

శిలువధారీ.. నీ శరణుకోరి

గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవులు భారీగా తరలివచ్చి శిలువపై యేసు పలికిన ఏడు మాటలను ధ్యానించారు. పలుచోట్ల క్రీస్తు శిలువ వృత్తాంతాన్ని ప్రదర్శించారు. సర్వ మానవాళి పాప విమోచన కోసం యేసు శిలువలో తన ప్రాణం అర్పించారని పాస్టర్లు వివరించారు.

– అనంతపురం కల్చరల్

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ అపహరణ

పెద్దవడుగూరు: మండలంలోని వీరేపల్లి వద్ద రైతుల పొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్‌ను దుండగులు అపహరించారు. గురువారం రాత్రి విద్యుత్ సరఫరా ఆగిన అనంతరం ఏకంగా పది ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్‌ను అపహరించుకెళ్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంగ్లిష్ సార్లు లేరిక్కడ!

- ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ పాఠ్యాంశాల బోధనకు తీవ్ర ఆటంకం
- తీవ్రంగా నష్టపోతున్న విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో ఆగిన పదోన్నతులు
- హైకోర్టు ఉత్తర్వులిచ్చినా పదోన్నతుల్లో వీడని చిక్కుముడి
- రాష్ట్రంలో ఒక్క ఉమ్మడి 'అనంత' జిల్లాలోనే ఈ దుస్థితి



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ పాఠ్యాంశాలు బోధించే టీచర్లు లేరు. ఫలితంగా పదో తరగతి విద్యార్థులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారు. 2023 జూన్‌లో అన్ని సబ్జెక్టులకు పదోన్నతులు కల్పించినా... హై కోర్టులో వివాదం కారణంగా ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతులకు బ్రేక్ పడింది. ఇంగ్లిష్ పదోన్నతులు తమకు మాత్రమే కల్పించాలంటూ డిగ్రీలో ఇంగ్లిష్ ప్రధాన అంశంగా ఉన్న ముగ్గురు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పదోన్నతులు జరగకుండా హైకోర్టు స్టే విధించింది. అప్పట్లో 230 ఎస్జీటీలకు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు దక్కాల్సి ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 280కు చేరింది. వాస్తవానికి 2023, జనవరిలో సీనియార్టీ జాబితా తయారు చేసి తాత్కాలిక పదోన్నతులు కల్పించారు. జూన్‌లో రెగ్యులర్ పదోన్నతులు ఇచ్చే సమయంలో కోర్టు కేసు కారణంగా ఈ ప్రక్రియ కాస్త ఆగిపోయింది.

నష్టపోతున్నది విద్యార్థులే

ఉమ్మడి జిల్లాలోని టి.వీరాపురం, నేత్రపల్లి, 74–ఉడేగోళం, డి.కొండాపురం, భూపసముద్రం, గుమ్మఘట్ట, గోనబావి, గొల్లపల్లి, కలుగోడు, తాళ్లకెర, రంగచేడు, భూపసముద్రం, పూలకుంట, గొల్లపల్లి, మురడి, మండ్లి, అపిలేపల్లి, బసాపురం, బెస్తరపల్లి, యర్రగుంట, మలయనూరు, తెంగల్లు, లక్ష్మంపల్లి, కనకూరు, వలస, ఆగ్రహారం, కె.శివరం, హేమావతి, బుచ్చయ్యగారిపల్లి, బాచేహల్లి, శెట్టూరు, తిప్పనపల్లి గ్రామాల్లోని జిల్లాపరిషత్ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలలతో పాటు కేపీ దొడ్డి, తూముకుంట, మహానంతపురం, కరిగానపల్లి తదితర గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. కుందుర్పి మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుండగా ఏ ఒక్క స్కూల్‌లోనూ ఇంగ్లిష్ టీచరు లేరు. అక్కడక్కడా కొన్ని పాఠశాలల్లో ఇతర పాఠ్యాంశాల టీచర్లతో ఇంగ్లిష్ బోధించేలా సర్దుబాటు చేసి విద్యాశాఖ అధికారులు మిన్నకుండిపోయారు. ఇంగ్లిష్ టీచర్ల కొరత కాస్త విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకంగా మారింది.

వీడని చిక్కుముడి..

ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతుల వివాదంపై ఈ ఏడాది ఫిబ్రవరి 5న హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. పదోన్నతులపై దాఖలైన కేసులన్నీ డిస్పోజ్ చేస్తూ ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని పదోన్నతులు కల్పించాలని తుది తీర్పునిచ్చింది. ఈ తీర్పు వెలువడి ఇప్పటికీ రెండు నెలలు దాటినా చిక్కుముడి వీడలేదు. మరోవైపు అర్హులైన ఎస్జీటీలకు అన్యాయం జరిగింది. మిగిలిన సబ్జెక్టులతో పోల్చుకుంటే ఇంగ్లిష్ పదోన్నతులు పొందే వారు రెండేళ్ల సీనియార్టీని కోల్పోయారు. వీరిలో కొందరు ఉద్యోగ విరమణ పొందారు. అయినా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికీ మేల్కొనలేదు.

ఇంగ్లిష్ బోధనకు ఆటంకం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చాలా ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ ఇంగ్లిష్ టీచర్లు లేక పాఠ్యాంశాల బోధనకు ఆటంకం కలుగుతోంది. 2023 జనవరిలో తాత్కాలిక పదోన్నతులు పొందిన వారి రెగ్యులర్ ప్రమోషన్లు నిలిచిపోయాయి. ఇప్పటికే అమలులో ఉన్న జీఓ ప్రకారం యూజీ, పీజీలో ఇంగ్లిష్‌తో పాటు బీఈడీలో ఇంగ్లిష్ మెథడాలజీ ఉన్నవారికి దశాబ్దాల కాలంగా ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన పదోన్నతులు ఇస్తున్నారు. – వై.నాగభూషణ ఎస్జీ టీచరు

హైకోర్టు తీర్పు బుట్టదాఖలు

2023, జూన్‌లో దాఖలైన కేసులను డిస్పోజ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 5న హైకోర్టు తీర్పు వెలువరించింది. పదోన్నతులపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలంటూ స్పష్టం చేసింది. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో విద్యార్థులతో పాటు టీచర్లూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే రెండేళ్ల సీనియార్టీ కోల్పోయాం. వెంటనే అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పిస్తే ఖాళీగా ఏర్పడే ఎస్జీటీ పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయొచ్చు. – జి.సూర్యుడు, ఎస్జీ టీచరు

డైరెక్టర్‌కు నివేదించాం

ఇంగ్లిష్ పదోన్నతుల అంశాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు నివేదించాం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ముందుకు పోతాం. – ఎం. ప్రసాద్‌బాబు, అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి

కర్మాగారంలో పేలుడు - కార్మికుడికి గాయాలు

తాడిపత్రి: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం వద్ద ఉన్న ఓ కర్మాగారంలో పేలుడు సంభవించి, ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గ్రామంలోని సుగుణ స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన కుశలప్ప కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు.ఈ నేపథ్యంలో శుక్రవారం విధుల్లో పాల్గొన్న ఆయన గ్యాస్ కట్టర్ వద్ద పనిచేస్తున్న సమయంలో అక్కడే ఉన్న ఓ ఆయిల్ డ్రమ్ము ఒక్కసారిగా బద్ధలైంది. ఘటనలో కుశలప్ప కాలు, చెయ్యి, తలకు డ్రమ్ము రేకులు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రేమికుడి వంచన.. యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువతి విషపూరిత ద్రావకం తాగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం ఊబిచెర్లకు చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి యువతిని ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. గ్రామంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఇద్దరూ కలసి మెలిసి తిరిగేవారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా పెళ్లి చేసుకుందామని ఆమె ఒత్తిడి చేయడంతో యువకుడు కుదరదని తేల్చి చెప్పాడు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న యువతి.. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపూరిత ద్రావకం తాగింది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న కుమార్తెను గమనించి, వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- అడవి పందుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగే కారణం


మృతుడు ఓబులేసు

బత్తలపల్లి: విద్యుత్ షాక్‌కు గురైన వివాహితను కాపాడే ప్రయత్నంలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇదే ఘటనలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు... బత్తలపల్లి మండలం ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కేశవనాయుడు రామాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఈ క్రమంలో అడవి పందులు పంటను నాశనం చేస్తున్నాయని గుర్తించిన ఆయన జీఏ వైరుతో పొలం చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం గొర్రెల కాపరులు మేపునకు జీవాలను తోలుకు రావడంతో వారు ప్రమాదం బారిన పడకూడదని భావించిన ఆయన నాలుగు రోజుల క్రితం పొలం చుట్టూ విద్యుత్ కంచెను తొలగించాడు. అయితే విద్యుత్ స్తంభం నుంచి పొలం వరకూ లాగిన వైరును తొలగించడం మరచిపోయాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వివాహిత లక్ష్మి శుక్రవారం దుస్తులు ఉతికేందుకు అటుగా వెళ్లింది. ఆమె వెంట వెళ్లిన కుమారుడు విద్యుత్ తీగ వైపుగా వెళుతుండడం గమనించి కాపాడే ప్రయత్నంలో అటుగా అడుగు వేసింది. అయితే అక్కడ నేల తేమగా ఉండడంతో షాక్‌కు గురైంది. ఆ సమయంలో గట్టిగా కేకలు వేయడంతో అక్కడికి సమీపంలో ఉన్న నాగభూషణ వెళ్లి కట్టెతో తీగను కొట్టాడు. ఆ సమయంలో తీగ ఎగిరి నాగభూషణను తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. విషయాన్ని గమనించగానే తల్లిదండ్రులు ఓబులేసు (69), లింగమ్మ ఒకరి వెనుక మరొకరు పరుగున వెళ్లి నాగభూషణు పైకి లేపే ప్రయత్నం చేయడంతో వారు కూడా షాక్‌కు గురయ్యారు. విషయాన్ని అక్కడికి సమీపంలో ఉన్న రవీంద్రారెడ్డి గమనించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. షాక్‌కు గురైన నలుగురూ అపస్మారక స్థితిలో ఉండడంతో గ్రామస్తులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందేలోపు ఓబులేసు మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ శివయ్య గ్రామానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. ఘటనపై బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చర్చిపై నుంచి పడి యువకుడి మృతి


మృతుడు విక్టర్‌కుమార్

తాడిపత్రి టౌన్: గుడ్ ఫ్రైడే వేళ చర్చిపై నుంచి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలు.. తాడిపత్రిలోని నందలపాడులో నివాసముంటున్న జయమ్మ, మనోహర్ దంపతుల కుమారుడు విక్టర్‌కుమార్ (25)కు మతిస్థిమితం సరిగా లేదు. గుడ్ ఫ్రైడే ని పురస్కరించుకుని గురువారం రాత్రి చర్చి అలంకరణలో భాగంగా పిల్లలతో చాలా సేపు ఆడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చర్చి పైకి చేరుకున్న విక్టర్‌కుమార్.. ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికుల సాయంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ లోపు పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి ఆత్మహత్య

యల్లనూరు: మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన రాగిపిండి చిన్న అంకిరెడ్డి భార్య వెంగమ్మ (80) ఆత్మహత్య చేసుకుంది. గత నెలలో చెయ్యి విరిగిన ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త అంకిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'ఉపాధి' డిమాండ్ల సాధనకు 21న పాదయాత్ర

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న కేశవరెడ్డి

అనంతపురం అర్బన్: ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి, డిమాండ్ల సాధనకు ఈ నెల 21న 'కష్టజీవుల పాదయాత్ర' చేపట్టనున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాసం) రాష్ట్ర కార్యదర్శి బి.కేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులేస్తున్నాయని మండిపడ్డారు. ఉపాధి భృతిగా ప్రతి కూలీకి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కూలీలకు బకాయి పడిన రూ.37 కోట్ల వేతనాన్ని తక్షణమే చెల్లించాలన్నారు. డిమాండ్ల సాధనకు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకెళ్లే క్రమంలో కష్టజీవుల పాదయాత్రను నాడు ఉపాధి హామీ పథకం ప్రారంభించిన నార్పల మండలం బండ్లపల్లి గ్రామం నుంచి ఈ నెల 21న ప్రారంభిచనున్నామన్నారు. 22 సాయంత్రం 4.39 గంటలకు అనంతపురంలోని కృష్ణకళామందిర్‌లో బహిరంగసభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి వ్యకాసం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, మాజీ ఎంపీ, ఏఐసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, తదితరులు పాల్గొంటారన్నారు. బహిరంగసభకు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నాగరాజు, పెద్దయ్య, రామాంజనేయులు, నరేష్ పాల్గొన్నారు.

రైల్లో ప్రయాణికుడి మృతి


మృతుడు భీమన్న

గుత్తి: రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ఉన్నఫళంగా మృతి చెందాడు. వివరాలు.. తెలంగాణలోని యాదాద్రికి చెందిన భీమన్న (42) బెంగుళూరుకు వలస వెళ్లి బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులు క్రితం సొంతూరుకు వెళ్లిన ఆయన శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి రైలులో బెంగళూరుకు ప్రయాణమయ్యాడు. గుత్తి జీఆర్పీ పరిధిలో ప్రయాణిస్తుండగా బోగీలోనే కుప్పకూలాడు. రైలు స్టేషన్‌కు చేరుకోగానే వైద్యులు చేరుకుని పరీక్షించారు. అప్పటికే గుండెపోటుతో భీమన్న మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు రంగారెడ్డి

అనంతపురం: నగర శివారులో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన ఎర్రగుంట్ల రంగారెడ్డి (46) శుక్రవారం ఉదయం అనంతపురంలో జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. 44వ జాతీయ రహదారిపై ఆర్‌కే ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రయాణిస్తుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన చంద్రబాబు కొట్టాలకు చెందిన బైక్ మెకానిక్ షేక్ రహమాన్ ఢీకొన్నాడు. ఘటనలో కిందపడిన రంగారెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నాటుసారా కేసుల్లో పట్టుబడితే రూ.లక్ష జరిమానా


మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం: నాటు సారా కేసుల్లో పట్టుబడితే రూ.లక్ష జరిమానా విధిస్తామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంపై ఎక్సైజ్ అధికారులతో స్థానిక ఆ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. పాత నేరస్తులు, అనుమానితులపై నిఘా ఉంచి, వారిని బైండోవర్ చేయాలన్నారు. తిరిగి నాటు సారా కేసుల్లో పట్టుబడితే రూ.లక్ష జరిమానా చెల్లించేలా కఠినంగా వ్యవహరించాలన్నారు. నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా పీడీ చట్టం కింద కేసు నమోదుకు సిఫారసు చేయాలన్నారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. జిల్లాలో కల్తీ కల్లు పూర్తిగా నిర్మూలించాలన్నారు. మద్యంషాపులు, బార్లలో ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా నిరంతరం తనిఖీలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. రామమోహన్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ సీఐ జయంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీనీలో 'యాజమాన్యం' పాటించండి

- జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్

గార్లదిన్నె: చీనీ తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని రైతులకు జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్ ఖాన్ సూచించారు. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పండ్ల తోటల్లో డ్రోన్ సర్వేపై ఏపీఎంఐపీ సిబ్బంది, ఎఫ్‌పీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వేసవిలో పండ్ల తోటలను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పండ్ల తోటల్లో సస్యరక్షణలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ముకుందాపురం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిందన్నారు. గ్రామంలో 950 చీనీ తోటలను డ్రోన్ ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రత్నకుమార్, విస్తరణాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం కత్తితో దాడి

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో పట్టణ పరిధిలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ క్రమంలో స్థానిక వడ్డే కాలనీలో తాగునీటి కోసం పరస్పర దాడులు చోటు చేసుకుని, ముగ్గురు కత్తి పోట్లకు గురయ్యారు. శుక్రవారం రాత్రి నీళ్ల కోసం ప్రకాష్, లక్ష్మి, గణేష్‌పై బోయ హనుమంతురాయుడు, వడ్డే సాంబ, వడ్డే పవన్ గొడవపడ్డారు. ఇరు వర్గాల మధ్య మాటామాట పెరగడంతో పరస్పరం దాడులకు తెగబడ్డారు. ఘటనలో హనుమంతురాయుడు, సాంబ, పవన్‌పై ప్రకాష్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రులను స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మామిడి చెట్ల నరికివేత


సంఘటనా స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: మండలంలలోని గ్రామానికి చెందిన సూర్యనారాయణ, లక్ష్మన్న, పుల్లన్న, సన్న నారాయణ, పెద్ద నారాయణ, అనిల్‌కు చెందిన 105 మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. మూడేళ్ల క్రితం పెన్నానదీ పరివాహక ప్రాంతంలో మామిడి మొక్కలు నాటుకున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మొక్కలను నరికి వేయడంతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, స్నిఫర్ డాగ్‌ను రంగంలో దించి నిందితుల ఆధారాలను సేకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



ఆత్మకూరులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసి రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ, సమానత్వాన్ని కాపాడాలని ముస్లింలు కోరారు. శుక్రవారం వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆత్మకూరులోని ముస్లింలు నమాజ్ అనంతరం నూరియాని జామియా మసీదు నుంచి ప్రధాన రహదారిలో నల్ల జెండాలు, జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. ఆత్మకూరు సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లిం మైనార్టీలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం అని ప్రపంచానికి చాటిన ప్రజల మధ్య మతోన్మాద పార్టీలు చిచ్చు పెట్టడం దారుణమని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని దేశ వ్యాప్తంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని లేదంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. చట్టాల పేరుతో ముస్లింలపై జరుగుతున్న దాడులను అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

న్యాయవాదులకు భద్రత కరువు

అనంతపురం: బెంగళూరులో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కో–చైర్మన్ వై.ఆర్.సదాశివా రెడ్డిపై రాడ్లతో దాడి చేయడం అమానుషం. ఈ క్రూరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆలూరు రామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో అత్యున్నత స్టాట్యూటరీ సంస్థ అయిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కో–చైర్మన్‌గా ఉన్న సీనియర్ అడ్వొకేట్‌పై ఇలాంటి దాడి జరగడం బాధాకరమన్నారు. సాధారణ న్యాయవాదులకు భద్రత కరువైందని తెలిపారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిన అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును తక్షణమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరారు. ఈ దాడికి బాధ్యుడైన వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.


జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని కలసిన కలెక్టర్



జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌కు మొక్క అందజేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ శుక్రవారం జిల్లా పర్యటనకు విచ్చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలెక్టర్ వినోద్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు.

లోకరక్షకుడు ఏసుక్రీస్తు



అలంకరణలో క్రీస్తు శిలువ



ఆత్మకూరు మండలం పి.యాలేరులో శిలువ మోస్తున్న ఫాదర్



టౌన్ కాంగ్రిగేషనల్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



వాక్యోపదేశం చేస్తున్న స్టీఫెన్ బాబు

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- చర్చిలకు భారీగా తరలివచ్చిన క్రైస్తవులు
- మార్మోగిన క్రీస్తు నామస్మరణ
- బైబిల్ సందేశం వినిపించిన పాస్టర్లు

అనంతపురం కల్చరల్: పాపుల కోసం శిలువనెక్కిన కరుణామయుడి శుభ శుక్రవార ప్రార్థనలు నగరమంతటా ఘనంగా జరిగాయి. క్రీస్తు సందేశం, ఏసు నామస్మరణ వాడవాడలా మార్మోగింది. ప్రత్యేక ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన క్రైస్తవులతో ప్రార్థనా మందిరాలు కిటకిటలాడాయి. లోకరక్షణ కోసం భువిపై అవతరించి శిలువపై రక్తం చిందించిన దైవకుమారుడి జీవిత గాథలను పలు చోట్ల సంఘ కాపరులు చక్కగా వినిపించారు. వివిధ చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

- అరవింద నగర్ సీఎస్ఐ హోలీట్రినిటీ సంఘం ఆధ్వర్యంలో శుభ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) ఆరాధనలు జరిగాయి. వేలాది మంది భక్తులు నియమ నిష్టలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సంఘ కాపరి రెవరెండ్ బెన్‌హర్ బాబు, వైఎస్సార్ కడప జిల్లా నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిషప్ ఐజాక్ వరప్రసాద్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు జీవితంలోని ప్రధాన ఘట్టాలను వివరించారు. బైబిల్ పఠనం, కీర్తనలు అనంతరం 'గుడ్ ఫ్రైడే' విశిష్టత, అమృత వాక్యాలను వినిపించారు.
- సప్తగిరి సర్కిల్‌లో ఉన్న టౌన్ కాంగ్రిగేషనల్ చర్చిలో బెంగళూరు నుంచి విచ్చేసిన స్టీఫెన్ బాబ్, చర్చి పాస్టర్ రెవరెండ్ సంపత్ కుమార్ వాక్యోపదేశం చేశారు. పాపుల రక్తాన్ని పరిశుద్ధం చేయడానికి దయామయుడైన క్రీస్తు శిలువ భారం మోస్తూ.. లోకానికందించిన క్షమాపణ, రక్షణ, ప్రేమ, ఎడబాటు, అకాంక్ష, విజయం, అప్పగించుట అనే చివరి మాటలను నేటి పరిస్థితులకు అన్వయిస్తూ చెప్పిన తీరు విశేషంగా ఆకర్షించింది. భక్తిశ్రద్ధలతో ఆలపించిన ఆరాధనా గీతాలు ఆకట్టుకున్నాయి.
- అరవింద నగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చిలో రెవరెండ్ మోజెస్ అనిల్ కుమార్, స్థానిక జీసెస్ నగర్‌లోని హెర్మోన్ చర్చిలో పాస్టర్ ఐజయ్య, కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో పాస్టర్ మనుష్యే, క్రీస్తు విశ్వాసుల సంఘంలో బ్రదర్ సోలోమోన్, గుల్జార్‌పేట గాస్పెల్ అసెంబ్లీ హాలులో ఫిలిఫ్ తదితరులు గుడ్ ఫ్రైడే సందేశాలను వినిపించారు.
- స్థానిక రామచంద్రా నగర్‌లోని 'కార్మియల్‌మాతా మందిరం, కోర్టు రోడ్డులోని గాస్పెల్ హాలు తదితర చోట్ల సిలువ ధ్యానాలు, క్రీస్తు ఆరాధన వైభవంగా జరిగాయి.

లోక రక్షకుడు ఏసు

రాప్తాడు: 'సకల మానవుల పాప పరిహారం కోసం ప్రాణమిచ్చిన ప్రభువు ఏసుక్రీస్తు. హింసా, స్వార్థం పేట్రేగిపోతున్న నేటి సమాజంలో శాంతి, కరుణ విస్తరించాలి. అందుకు యేసు చూపిన మార్గాలను అనుసరించాలి' అని రాప్తాడులోని కరుణామయుడు పుణ్యక్షేత్రం చర్చి, చిన్మయ నగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చి విచారణ గురువులు బాలరాజు, ఫాదర్ రాజు, బాలచౌరి, బొంతు ప్రసాద్, ఫాదర్ రవీంద్రా ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాప్తాడులోని కరుణామయుడు చర్చి, చిన్మయ నగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏస్తు క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల ద్వారా క్షమాగుణం, బాధ్యత, ప్రేమ, పాపపు ఒప్పుకోలు, దయా గుణాలను అలవర్చుకోవాలన్నారు. సర్వజనుల కోసం ఏసుక్రీస్తు శిలువ మరణం పొందిన రోజునే గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటామని తెలిపారు.



రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో శిలువ యాత్ర

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పి.యాలేరులో ఏసుప్రభుకు శిలువ వేసిన విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. అదే విధంగా శిలువను మోస్తూ 14 చోట్ల ఆపి ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చికి వెళ్లి ప్రార్థనలు చేశారు. మండలంలో సనప, పంపనూరు గ్రామాల్లో కూడా గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి.



భక్తిగీతాలు ఆలపిస్తున్న దృశ్యం



రామచంద్ర నగర్ చర్చిలో ప్రార్థనలకు తరలివచ్చిన భక్తులు



క్రీస్తును ఆరాధిస్తున్న చిన్నారులు

శిల్ప గురు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



దళవాయి చలపతికి దరఖాస్తు ఇస్తున్న లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య

అనంతపురం కల్చరల్: జాతీయ, శిల్ప గురు పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని తోలు బొమ్మల తయారీలో నిష్ణాతులైన హస్తకళాకారులకు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య సూచించారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఉమ్మడి అనంత జిల్లాలోని హస్తకళాకారులకు శుక్రవారం లేపాక్షి ఎంపోరియంలో ఆయన అందజేసి, మాట్లాడారు. ఏపీ లేపాక్షి కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిష్ణాతులైన కళాకారులకు జాతీయ, శిల్పగురు అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందు భాగంగా 'ఒన్ డిస్ట్రిక్ట్ ఒన్ క్రాఫ్ట్' పరిధిలో జిల్లాలో కేవలం తోలుబొమ్మల తయారీ కళాకారులకు మాత్రమే పురస్కారాన్ని అందుకునే అవకాశం ఉందన్నారు. అవార్డుకు ఎంపికైన వారికి వారి అర్హత, నైపుణ్యం బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నగదు పురస్కారాన్ని అందజేస్తారన్నారు. మే 5వ తేదీ లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అమరనాథ్ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు 40 శాతం రాయితీ

తాడిపత్రి: పండ్ల తోటల విస్తీర్ణం పెంచేందుకు ఉద్యాన రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీ అందిస్తోందని తాడిపత్రి ఉద్యానవన అధికారిణి ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీనీ, దానిమ్మ, బొప్పాయి, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్, పూల తోటలకు రాయితీ ఇస్తామన్నారు. నీటి కుంటల తవ్వకం ద్వారా పండ్ల తోటలకు రక్షక తడులను అందించేందుకు ఒక్క యూనిట్ మేర 1200 క్యూబిక్ మీటర్లు చొప్పున తవ్వుకున్న రైతులకు 50 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే దానిమ్మ తోటలో మందు పిచికారీ చేయడానికి అవసరమయ్యే తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లను 40 శాతం రాయితీ ఉంటుందన్నారు. పక్షుల బెడద నుంచి దానిమ్మ పంటను రక్షించుకోవడానికి యాంటీ బర్డ్ నెట్ పథకం ద్వారా 40 శాతం రాయితీ అందిస్తుందన్నారు. అర్హులైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం సబ్సిడీ నగదు జమ చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


కోమా నుంచి కోలుకుని ఇంటికి



నాగేంద్రను డిశ్చార్జ్ చేస్తున్న మెడిసిన్ వైద్యులు

అనంతపురం మెడికల్: గులియన్ బరీ సింట్రోమ్‌తో బాధపడుతూ కాళ్లు, చేతులు, మాట పడిపోయి కోమా స్టేజీలో ఆస్పత్రిలో చేరిన కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ నాగేంద్ర కోలుకోవడంతో మెడిసిన్ వైద్యులు శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. ఈ నెల 7న సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకురాగా మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్ అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో అడ్మిట్ చేసుకుని అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు, స్టాఫ్‌నర్సుల పర్యవేక్షణలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించిన విషయం తెలిసిందే. ఈ నెల 14న ఆరోగ్యం కుదుట పడడంతో మేల్ మెడిసిన్ వార్డుకు తరలించారు. అక్కడ ఐదు రోజుల పాటు వైద్యులు, స్టాఫ్‌నర్సులు సేవలందించారు. పూర్తి స్థాయిలో కోలుకున్న నాగేంద్రను శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర, వారి కుటుంబీకులు డాక్టర్ భీమసేనాచార్ బృందానికి , స్టాఫ్‌నర్సులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అరకు కాఫీ పౌడర్‌తో ఏసుక్రీస్తు చిత్రం



రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే (బాలుర) పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరాములు గుడ్ ఫ్రైడే సందర్భంగా అరకు కాఫీ పౌడర్‌తో ఏసుక్రీస్తు చిత్రం గీశారు. త్యాగం, ప్రేమ, క్షమకు ప్రతీకగా నిలిచిన ఏసుక్రీస్తును స్మరించుకుంటూ చిత్రం వేసినట్లు ఆయన తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే బాదుడే

- కొత్త వాహన చట్టంలో పకడ్బందీగా ట్రాఫిక్ రూల్స్
- లైసెన్స్ లేకుంటే రూ.5 వేలు
- మైనర్లకు వాహనాలు ఇస్తే కేసుల నమోదు



రాప్తాడులో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశులు (ఫైల్)

రాప్తాడు: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే రోజులకు ఇక కాలం చెల్లింది. ఇక నుంచి హెల్మెట్ లేకపోయినా, వాహన ధ్రువపత్రాలు చూపించకపోయినా రూ.వేలల్లో జరిమానాలు కట్టాల్సిందే. ఇదంతా కొత్త వాహన చట్టం చెబుతోంది. గతేడాది జూన్ నుంచే చట్టం అమల్లోకి వచ్చినా అది క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చేపడుతున్న ఈ చర్యలకు అంతా సహకరించాలని కోరుతున్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని.. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ఇతరులకు బండిస్తే అంతే..

చాలా మంది తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలకు బైక్ ఇవ్వడాన్ని చాలా గొప్పగా భావిస్తారు. అయితే అది ఇకపై కుదరదు. సదరు మైనర్ బాలుడు లేదా బాలిక బైక్ నడిపి ప్రమాదానికి గురైతే వాహనం ఎవరి పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంటే వారిపై కేసు నమోదు చేస్తారు. యాక్సిడెంట్ చేసిన వారితో పాటు వాహనం ఇచ్చిన వారిపైనా, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అమ్మిన వ్యక్తిపైనా కేసు నమోదు చేస్తారు. అప్పట్లో అయితే వెంటనే స్టేషన్ బెయిల్ మంజూరయ్యేది. నేరం రుజువైతే రెండేళ్ల వరకూ జైలు శిక్ష ఉండేది. ప్రస్తుతం నిబంధనలు మారాయి. యాక్సిడెంట్‌కు కారణమైన వ్యక్తితో పాటు సంబంధిత వాహన యజమానికి వెంటనే బెయిల్ వచ్చే అవకాశం లేదు. పదేళ్ల పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

జరిమానా ఇలా..

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు (గతంలో రూ.500) ఉండేది. రెడ్‌లైట్‌ను ఉల్లఘించి వాహనం నడిపితే రూ.500. రాంగ్‌రూట్‌లో నడిపితే రూ.5 వేలు. అతివేగంగా వాహనం నడిపితే రూ.100. మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు (గతంలో ఇది రూ.2 వేలు ఉండేది). ర్యాష్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కారు నడిపితే రూ.1,000 జరిమానా విధిస్తారు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే రూ.1,000 జరిమానా, మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు. అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళ్తే రూ.10 వేలు, ద్విచక్ర వాహనాల్లో ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ.2 వేలు, ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.2 వేలు జరిమానా విధిస్తారు.

కఠినంగా వాహన చట్టాలు

ర్యాలీలు, పుట్టిన రోజు వేడుకలు పేరు చెప్పి వాహనాల సైలెన్సర్లు తీసి వాహనాలు నడపడం ప్రతి చోట జరిగేదే. హెల్మెట్ లేకున్నా, ట్రిపుల్ రైడింగ్ చేస్తే ఉపేక్షించరు. సైలెన్సర్లు తీసినా, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా లేకున్నా, ఓవర్ స్పీడ్‌గా వాహనాలు నడిపితే జరిమానా విధించేలా వాహన చట్టంలో నిబంధనలు పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నూతన మోటరు వాహన చట్టం నిబంధనలను అనుసరించి వాహన చట్టం ఉల్లంఘన కేసుల్లో భారీగా జరిమానాలు విధించనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



కొత్త మోటార్ వాహన చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. రవాణా శాఖ అధికారులతో కలిసి మండలంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. 44వ జాతీయ రహదారిపై ఉదయం, సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. మద్యం సేవించి వచ్చే వారికి బ్రీత్ అనలైజర్స్ పెట్టి చెక్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు చట్టాలపై వివరిస్తున్నాం.

– శ్రీహర్ష, సీఐ, రాప్తాడు

నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలి. వచ్చీ రానీ డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ మీ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి.

– వెంకటేశులు, డీఎస్పీ, అనంతపురం రూరల్

బాధ్యతల స్వీకరణ



డాక్టర్ విష్ణుమూర్తి

పుట్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విష్ణుమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉండగా డాక్టర్ హిమబిందు వైద్య వృత్తిలో పీజీ చేయడానికి వెళ్లడంతో ఆమె స్థానంలో డాక్టర్ విష్ణుమూర్తి నియామకమయ్యారు.

బీకేఎస్ సీఐగా పుల్లయ్య



బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం సీఐగా పుల్లయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న కరుణాకర్ తిరుపతి జిల్లాకు బదిలీపై వెళ్లారు. వైఎస్సార్ జిల్లాలో సీఐగా పని చేస్తున్న పుల్లయ్య బీకేఎస్ మండల సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ పుల్లయ్య మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

జూదరుల అరెస్టు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని కంపచెట్లలో గత కొన్ని రోజులుగా కొందరు పేకాట ఆడుతున్నారు. అందిన సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఆశాబేగం, సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.17 వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఏఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ హనుమంతు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దెక్కలూరు గ్రామ శివార్లలో కాళికాదేవి ఆలయం వద్ద శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట స్థావరంపై దాడి చేయగా తొమ్మిది మంది పేకాట ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులు పారిపోగా ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. వారి నుంచి 16,050 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఎనిమిది మోటర్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.